విశాలాంధ్ర కృష్ణా జిల్లా

వైద్య సేవలు మరింత చేరువ : ఎమ్మెల్యే పేర్ని నాని

విశాలాంధ్ర-మచిలీపట్నం : వైద్య సదుపాయాలు కల్పించి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. గురువారం ఆయన చిలకలపూడిలో నవీకరించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనంను ప్రారంభోత్సవం చేశారు. అందిస్తున్న వైద్య సేవలు, మందుల రకాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనానికి మరమ్మతులను పూర్తి చేసుకొని ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలను అందించడానికి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ హెల్త్ సెంటర్ 9 సచివాలయాల పరిధిలోని 36 వేల మందికి పైగా అన్ని రకాల వైద్య సేవలను అందిస్తుందని చెప్తూ 172 రకాల మందులు, 33 రకాల సర్జికల్స్, 63 రకాల టెస్టులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. 0-5 మధ్య వయస్సు పిల్లలకు ఇమ్యునైజేషన్ అందించడంతో పాటు ప్రతి నెల 9,10 తేదీలలో ప్రధాన మంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ ద్వారా గర్భిణీ స్త్రీలకు నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ప్రాథమిక అత్యవసర సేవలు, కిశోర బాలబాలికలకు కౌన్సిలింగ్ సేవలు, అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, డిఎంఅండ్ హెచ్ డా. జి.గీతాబాయి, డా.దీప్తి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ మహిళా పోలీస్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసుల డైరీని ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో గ్రామ, వార్డు మహిళా పోలీసు, పోలీస్ వారితో కలసి చక్కగా పనిచేస్తున్నారని, దిశ మొబైల్ యాప్ ఆవశ్యకత దానిని డౌన్‌లోడ్ చేసుకునే విధానం గురించి ఇంటింటికి వెళ్ళి ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించడం ఆ యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలో చెప్తారని అన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యక్రమాలు, అనుమానాస్పదమైన కొత్త వ్యక్తులు, నేరస్థులు, రౌడీల కార్యకలాపాలు, దొంగలు, దొంగ సొత్తు కొనేవారు చట్ట వ్యతిరేక కార్యక్రమాలు గురించి పూర్తి సమాచారం సేకరించడం జరుగుతోందన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలలో అపార్ట్‌మెంట్ వారితో సంమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రజలలో భయాన్ని పోగొట్టడం వంటి కార్యక్రమాలను పోలీస్ వారితో కలిసి చేయడం అభినందనీయం అని మున్ముందు ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి పోలీస్ కమీషనర్ విశాల్ గున్ని, అడ్మిన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ మోకా సత్తిబాబు, గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించే వ్యవస్థ కోసం పనిచేద్దాం

విశాలాంధ్ర-మచిలీపట్నం : మహిళలు ఎదగడానికి అవకాశం ఇచ్చే పరిస్థితుల కోసం కలిసి పనిచేద్దామని కృష్ణా జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సులో వివిధ రంగాల్లో ప్రతిభను ఆదిత్యతను సాధికారతను సాధించిన మహిళ మణులను గౌరవించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మాట్లాడుతూ, సమాజంలో పురుషుల కన్నా శక్తి సామర్థ్యాలు, కుశాగ్ర బుద్ధితో యోచించే శక్తి మహిళలకే అధికంగా ఉన్నందున సమాజాన్ని తీర్చిదిద్దే విషయంలో మహిళలు అనేక కీలక రంగాల్లో ముందుంటున్నారని ప్రశంసించారు. తొలిత ప్రసంగించిన జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ, పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. మహిళా దినోత్సవం రోజున మాత్రమే మహిళలను గౌరవించడం కాకుండా ప్రతి రోజు మహిళల పట్ల విధేయత చూపాలని కోరారు. తర్వాత జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ ప్రసంగిస్తూ, ఆర్థిక స్వేచ్ఛ స్వావలంబన కోసం ప్రతి మహిళ కృషి చేయాలన్నారు. విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం మీ గుప్పిట్లో ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా మహోన్నతంగా రాణించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవితా, ముడా చైర్ పర్సన్ బొర్రా నాగ దుర్గ భవాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఎ, మెప్మా పి డి. పి.ఎస్ ప్రసాద్, ఐసిడిఎస్ పిడి సువర్ణ, ముడా వీసి రాజ్యలక్ష్మి, డి సి పి ఓ జాన్సన్ పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు మెరుగు పరుచుకోవాలి : ఎస్పీ జాషువా

విశాలాంధ్ర-కూచిపూడి : పోలీసులు ప్రజలతో మమేకమై సత్సంబంధాలు పెంచుకోవాలని ఎమ్మెల్యే కైలేఅనీల్ కుమార్ సూచించారు. మొవ్వ మండలంలోని కూచిపూడి పోలీస్ స్టేషనుకు నూతన భవన నిర్మాణానికి గురువారం ఎస్పీ పి జాషువాతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన, శిలాఫల కావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించి హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పామర్రు నియోజకవర్గంలోని కూచిపూడి, పమిడిముక్కల, తోట్లవల్లూరులలో పోలీస్‌స్టేషన్లో నూతన భవనాలు నిర్మించే కార్యక్రమంలో భాగంగా తొలిగా కూచిపూడి పోలీస్టేషన్ భవన నిర్మాణం ప్రారంభించామన్నారు. ఈ భవన నిర్మాణానికి శాసనసభ్యులు నుంచి నిధులు అందించే భాగంగా తొలిసారిగా పోలీస్‌స్టేషన్‌కి వెళ్లే రహదారి కోసం రూ.5 లక్షలు అందజేశామని యుద్ధప్రాతిపదికన రబ్బిష్ రోడ్డు వేయడం జరిగిందని వివరించారు. అదేవిధంగా పమిడిముక్కలలో సర్కిల్ సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణ పనులు కూడా జరుగుతాయని వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు స్నేహితులేనని తమ సమస్యలు చెప్పుకునే బాధితులు నిర్భయంగా చెప్పి సహాయం పొందాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందనిపేర్కొంటూ సభలో నాట్యాన్ని ప్రదర్శించిన కళాకారుణులను అభినందించారు. పామర్రు సీఐ ఎం వెంకటనారాయణ స్వాగతం పలికిన ఈ సభలో అడిషనల్ ఎస్పీ ఎస్ వెంకట రామాంజనేయులు, గుడివాడ డి.ఎస్.పి ఎన్ సత్యానందం, కూచిపూడి ఎస్సై డి సందీప్, సిబ్బంది ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ వెలగం రమణ, సర్పంచ్ భర్త వైసీపీ నాయకులు కొండవీటి అమరబాలేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి కేబీఎన్‌లో రీజనల్ క్విజ్ ఛాంపియన్‌షిప్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 10, 11 తేదీల్లో రీజనల్ క్విజ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి రాష్ట్ర వ్యాపితంగా క్విజ్ పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగా తొలి దశలో ప్రాంతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వివిధ కళాశాలలు విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పోటీలు ప్రిలిమ్స్, క్వాలిఫెయింగ్, క్వార్టర్ ఫైనల్స్‌గా మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే సెమీఫైనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

"మానవతా"ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : సమాజంలో నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీపడుతూ వారి ఆధిక్యతను చాటుకుంటున్నారని మానవతా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, పామర్రు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి దగాని సంగీతరావు పేర్కొన్నారు. కూచిపూడి పెదపూడి సెంటర్లోని శాంతి కాంప్లెక్స్‌లో ఆ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొని అతిథులకు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం తన ప్రసంగంలో మహిళల ఔన్నత్యాన్ని ప్రస్తావించారు. అదే సందర్భంగా మానవతా సంస్థ నిర్వహిస్తున్న వివిధ రకాల సేవలను కొనియాడారు. ఆ సంస్థ అధ్యక్షులు పిట్టు శ్రీనివాసరావు అధ్యక్షో పన్యాసం చేశారు. ఈ సందర్భంగా తమ తమ రంగాలలో సేవలు అందిస్తున్న నారీమణులను సత్కారం చేశారు. పిఎస్ తెలుగు యూనివర్సిటీ శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో సంగీతం, నాట్యంలో సేవలందిస్తున్న డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని, పెదపూడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి శ్రావణి, ముత్తూట్ ఫిన్ కార్ప్ మేనేజర్ వేముల కిరణ్మయి, కూచిపూడి మహిళా కానిస్టేబుల్ చిరివెళ్ల శిరీషలను శాలువాలతో పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కోశాధికారి తాళ్లూరి మోహన్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : పదవ తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్ (ప్రీ ఫైనల్) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 3వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవతరగతి పరీక్షలకు ముందుగా నిర్వహిస్తున్నారు. మొవ్వ మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల, నాలుగు ప్రైవేట్ పాఠశాలలతో కలిపి 13 పాఠశాలలో 580 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. దీనిలో బాలురు 285 మంది కాగా, బాలికలు 295 మందని మండల విద్యాశాఖ అధికారి ఎన్. శివశంకరరావు తెలిపారు. దీనిలో భాగంగానే కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 34 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు హెచ్ ఎం అన్నేలక్ష్మీకుమారి తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి విరాళాలు

విశాలాంధ్ర-కూచిపూడి : గంగా బాలా త్రిపుర సుందరి రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కూచిపూడి నాట్య బావుటాలను ఎగురవేస్తున్న కళాకారుల ద్వారా సేకరించిన నిధులు రూ.3,58,997ల చెక్కును 'సేవ్ కూచిపూడి'డైరెక్టర్ భావన పెదప్రోలు ఆ దేవాలయ పాలకమండలి సభ్యులకు అందజేశారు. కూచిపూడిలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు పొందిన కూచిపూడి నాట్యాచార్యిణి మంజు భార్గవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాట్యాచార్యుల ఇలవేలపైన బాలా త్రిపుర సుందరి అమ్మవారి దేవాలయ అభివృద్ధికి తాముసైతం సమిధలుగా మారడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ నిధులు అందించడానికి సహకరించిన నాట్యాచార్యులు, సహకార వాయిద్యకారులు, కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా దేవాలయ అభివృద్ధికి సహకరించాలనుకున్న వధాన్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాట్యాచార్యులు పలువురు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుని కుటుంబానికి శ్యాంకిషోర్ ఆర్థికసాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : మృతి చెందిన రిక్షా కార్మికుల కుటుంబానికి శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ శ్యాంకిషోర్ నాయుడు సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. 7వ వార్డుకు చెందిన మద్దాల మరియదాసు రిక్షా కార్మికుడు మృతి చెందడంతో గురువారం మరియ దాసు కుమారుడు శాంతా రావుకు శ్యాంకిషోర్ నాయుడు రూ.5 వేలు మృతిని కుటుంబానికి అందజేశారు. రిక్షా కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని శ్యాంకిషోర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దాల వెంకటేశ్వరరావు, మద్దాల చిరంజీవి, డికుళ్ళ భాస్కర్, మద్దాల ప్రసాద్, మద్దాల అంజలయ్య, మద్దాల బాలశౌరి, సొసైటీ సభ్యులు సాయి లీలా ఫణీంద్ర పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-విజయవాడ : జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో 'స్కిల్ హబ్' కార్యక్రమంలో భాగంగా యువతకు స్వయం ఉపాధి నిమిత్తం నైపుణ్యాభివృద్ధి కోసం టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు ప్రత్యేకంగా మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎ.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 మధ్య వయస్సు గల వారు శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను తీసుకుని మొగల్రాజపురంలోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సతీష్ చంద్ర కౌశిక్‌కు ప్రజానాట్య మండలి నివాళి

విశాలాంధ్ర-విజయవాడ : ప్రముఖ హిందీ చలనచిత్ర నటుడు సుప్రసిద్ధ దర్శకులు సతీష్ చంద్ర కౌశిక్ (66) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 1956 ఏప్రిల్ 13న హర్యానాలో జన్మించిన ఆయన భారత హిందీచలనచిత్ర పరిశ్రమలో నటుడుగా, దర్శకుడుగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. 'రూప్ కీ రాణి చోరోన్ కా రాజా', హమారా దిల్ ఆప్కే పాస్ హై, మిలేంగే మిలేంగే, కర్జ్, తేరానామ్ వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. అలాగే ఉత్సవ్, జమై రాజా, బడే మియాన్ చోటే మియాన్, బాఘీ 3, శర్మాజీ వంటి అనేక చిత్రాలలో నటించారు. టీవీ సీరియల్స్‌లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారు. భారత చలనచిత్ర సీమలో అనేక విజయాలు సాధించారు. హోలీ పర్వదినం సందర్భంగా జావేద్ అఖ్తర్, షబానా ఆజ్మీ ఇంట్లో రిచా చద్దా, మహిమా చౌదరిలతో కలిసి హోలీ సంబరాలలో పాల్గొన్నారు. ఆ వేడుకల ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. అవే సతీష్ చంద్ర కౌశిక్ సతీష్ చివరి ఫోటోలు. ఆయన మృతి చెందటంపై అభిమానులు కన్నీటిపర్యంతం అయ్యారు. చంద్రకౌశిక్ మృతి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి విజయవాడ నగర సమితి గురువారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. దేశం గొప్ప కళాకారుడ్ని కోల్పోవటం బాధాకరం అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సతీష్‌కౌశిక్‌కు నివాళులర్పించిన వారిలో ప్రజానాట్య మండలి నగర ఇన్‌చార్జ్ లంక దుర్గారావు గౌరవాధ్యక్షులు కె.వి భాస్కరరావు, నగర అధ్యక్షులు ఎస్ కే నజీర్, కార్యదర్శి డి.సూరిబాబు, ఆఫీస్ బేరర్ కాళ్ళ చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతగల నేత విన్నకోట

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: సీనియర్ పాత్రికేయులు, కార్మికనేత, రంగస్థల ప్రముఖుడు విన్నకోట వేంకటేశ్వరావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు నివాళులు అర్పించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఇటీవల కన్నుమూసిన సీనియర్ పాత్రికేయుడు విన్నకోట వెంకటేశ్వర రావు సంస్మరణ సభను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడగాంధీ నగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన ఈ సమావేశానికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విన్నకోట వెంకటేశ్వరావు జర్నలిస్ట్‌గా, కార్మికసంఘ నాయకునిగా, కళాకారుడిగా సేవలు అందించారన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమంలో విన్నకోట కీలక పాత్ర పోషించారన్నారు. ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ విన్నకోట వెంకటేశ్వరావు నిబద్ధత కలిగిన పాత్రికేయుడని, కార్మిక సంఘాలలో పనిచేశారని, కార్మిక సంఘాలలో ఆయనకున్న అపారమైన అనుభవం ఏపీయూడబ్ల్యూజేకు చాలా ఉపయోగపడిందన్నారు. విన్నకోట మంచి నాయకత్వ లక్షణాలను కలిగి ఉన్న వ్యక్తి అన్నారు. పాలకొల్లులో జర్నలిస్టులకు ఇంటి స్థలాలను అందరికి వచ్చే విధంగా కృషి చేశారని గుర్తు చేశారు. విన్నకోట వేంకటేశ్వరరావు లేని లోటు తీర్చలేనిదని అన్నారు.

ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ మచిలీపట్నంలో జన్మించిన విన్నకోట యువశక్తి పత్రికను స్థాపించి, కార్మిక సంఘాలలో సేవలు అందించారని తెలిపారు. బతుకు తెరువు కోసం పాలకొల్లు వచ్చిన విన్నకోట యాభై ఏళ్లపాటు పత్రికా రంగంలో కొనసాగారని, ప్రజాసమస్యలను వెలుగులోకి తెచ్చి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్‌లో వివిధ బాధ్యతలు చేపట్టి జర్నలిస్టు సమస్యలపై విశేషకృషి చేశారన్నారు. కార్మికులకు చేసిన సేవకు 1998 లో రాష్ట్రప్రభుత్వం శ్రమశక్తి అవార్డు ప్రదానం చేసిందని , నాటకరంగంలో మూడుసార్లు నంది అవార్డు సాధించారని తెలిపారు. పాలకొల్లులో జరిగిన విన్నకోట సంస్మరణ సభకు వెయ్యి మంది పాల్గొన్నారని చెప్పారు. తొలుత విన్నకోట చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు.

విన్నకోట కుమారుడు విన్నకోట వెంకట రమణ మాట్లాడుతూ తన తండ్రికి ఏపీయూడబ్ల్యూజేకి చిరకాల అనుబంధం ఉందన్నారు. విజయవాడ లో సంస్మరణసభ ఏర్పాటు చేసిన ఏపీయూడబ్ల్యూజేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యునియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ విజయవాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి , కొండా రాజేశ్వరరావు, ఐజేయూ సభ్యులు ఎస్కే బాబు, సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. జయరాజు, కౌన్సిల్ సభ్యులు దారం వేంకటేశ్వరావు, జి. రామారావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఆర్. వసంత్ , జర్నలిస్టు మిత్రులు పెద్ద ఎత్తున జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ విజయవాడ వారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఈవోపీఆర్డి ఎం. నాగిరెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ మండలములోని వెంట్రప్రగడ పంచాయతీ 12వ వార్డు నెంబర్, పాములపాడు నాలుగవ వార్డు నెంబర్ ఇటీవల మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ఖాళీగా ఉన్న ఆ స్థానాలలో ఎన్నికలు జరపటానికి ముందు మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఆ వివరాలు తెలియజేయడం జరిగిందని నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకుడు జాజుల సుబ్రహ్మణ్యం, సిపిఎం నాయకులు పంచల కృష్ణారావు, ఉప్పలపాటి అనూష పాల్గొన్నారు.

అయ్యంకి వర్ధంతి

విశాలాంధ్ర-అవనిగడ్డ: గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతిని గ్రంథాలయ అధికారి జె ప్రభుదాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రేడ్ 1 గ్రంథాలయంలో గ్రంథాలయం అధికారి ఆధ్వర్యంలో అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు ్ళ అర్పించారు. గ్రంథాలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనిఆడారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా వెంకటరమణ(బాబ్జీ) చనిపోయి ఏడాది అయిన నేటికి అయన ప్రతి ఒక్కరికి గుర్తు ఉండిపోవడం అయన మంచితానానికి గుర్తు అని పెన్నుమోతు వంశీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పాటిమిద గల కరుణాపీఠంలోని వృద్ధుల ఆశ్రంలో అడపా బాబ్జీ జ్ఞాపకార్థంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చందు, ఆంజనేయులు, కె.కె.డి ప్రసాద్, పల్లపోతు మరళీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 'వి' ప్రత్యేక ఆఫర్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సుప్రసిద్ధ టెలికామ్ ఆపరేటర్ వీ, భారతదేశంలో అతి పెద్ద జాబ్ సెర్చ్ ప్లాట్‌ఫామ్ అప్నాతో భాగస్వామ్యం చేసుకుంది. ఈ యాప్ ద్వారా మహిళలు టీచర్లు, టెలికాలర్లు, రిసెప్షనిస్ట్‌లు మొదలైన ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిలో ఉన్నాయి. వీటితో పాటుగా వేలాది పార్ట్ టైమ్, వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు సైతం వి యాప్‌పై వి జాబ్స్, విద్య వేదిక పై లభిస్తాయి. వీటితో పాటుగా అప్నాతో భాగస్వామ్యం చేసుకుని ప్లేస్‌మెంట్ గ్యారెంటీడ్ ప్రోగ్రామ్‌ను ఔత్సాహికులు టెలికాలర్లుగా శిక్షణ పొందడంపై 5వేల రాయితీ అందిస్తుంది. ఈ ఆఫరింగ్స్ వి యాప్‌పై మార్చి 7 నుంచి 14 వరకూ అందుబాటులో ఉంటాయి.

స్కోడా ఆటో ఇండియా, స్కోడా సింగిల్ వికెట్ టోర్నమెంట్ సీజన్ 2

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : స్కోడా ఆటో ఇండియా, స్కోడా సింగిల్ వికెట్(ఎస్ ఎస్ డబ్ల్యూ)టోర్న మెంట్ యొక్క సీజన్ 2ని ప్రకటించింది, దీనితో భారతదేశం అంతటా 59 నగరాలు, 32,000కు పైగా యువ క్రికెటర్లను కవర్ చేయాలనే లక్ష్యంతో ఉంది. స్కోడా సింగిల్ వికెట్ సీజన్ 2 ఏప్రిల్ 28న ప్రారంభమవుతుంది.స్కోడా ఆటో ఇండియా, బ్రాండ్ డైరెక్టర్, పెట్రోసోలిక్ మాట్లాడుతూ "స్కోడా ఆటో ఇండియా, కస్టమర్ సెంట్రిసిటీ తమ కస్టమర్ల పట్ల క్రీడ, పోటీ మరియు నైపుణ్యం కాకుండా, మానవ స్ఫూర్తిని జరుపుకోవడం కూడా మా హ్యూమన్ టచ్ అప్రోచ్ లో భాగంగా చేసే ప్రతి పనికి కస్టమర్లు కేంద్రంగా ఉందన్నారు.

ఫెర్టి కేర్ ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నగరంలోని మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటరులో ఫెర్టి కేర్ ఐవీఎఫ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ మంజుల అనగాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డాక్టర్ మంజుల మాట్లాడుతూ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక చికిత్సలతో సంతాన లేమి సమస్యను చక్కగా పరిష్కరించవచ్చని తెలిపారు. సంతానం భాగ్యం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు ఫెర్టి కేర్ అద్భుత అవకాశమని అన్నారు. ఒంగోలులోని సెంటర్ ద్వారా అనేక మందికి సంతాన సాఫల్య చికిత్సలందించిన ఫెర్టి కేర్ వైద్య బృందానికి డాక్టర్ మంజుల అనగాని అభినందనలు తెలియజేశారు. అనంతరం ఫెర్టి కేర్ మెడికల్ డైరెక్టర్లు డాక్టర్ ఉజ్వల్ జాస్తి, డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ, ఒంగోలులో 2021లో ఫెర్టి కేర్ ఐవీఎఫ్ సెంటరును ప్రారంభించామని, తమ రెండేళ్ల విజయ ప్రస్థానంలో 70 శాతం సక్సెస్ రేటుతో 500కి పైగా ఐవీఎఫ్ సైకిల్స్ ను పూర్తిచేశామని వివరించారు. కార్యక్రమంలో ఆలిండియా ప్రయివేట్ మెడికల్ కాలేజ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గన్ని భాస్కరరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, విజయవాడ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ సుశీల పిన్నమనేని, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.ఎ. రెహ్మాన్, ఫెర్టి కేర్ విజయవాడ సెంటర్ క్లినికల్ హెడ్ డాక్టర్ జె. ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలను సంరక్షించుకోండి

వరల్డ్ కిడ్నీడే సందర్భంగా స్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ప్రత్యేక కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మూత్రపిండాలకు సంబంధించిన సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని, నిశబ్దంగా ప్రాణాలను హరించే కిడ్నీ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం ఏమాత్రం తగదని ప్రముఖ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ నిపుణులు డాక్టర్ అన్వేష్ అన్నారు. గురువారం వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా సత్యనారాయణ పురంలోని స్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. మూత్రపిండాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు, కిడ్నీల సంరక్షణ, కిడ్నీ వ్యాధులకు చికిత్సల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ.. ప్రపంచ జనాభాలో 10 శాతం మంది, 65 ఏళ్ల వయసు పైబడిన వారిలో సగం మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. పాదాల వాపు, అలసట, ఆకలి మందగించడం, మూత్రం నురుగుగా రావడం వంటివి కిడ్నీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్వర హాస్పిటల్ సీఈవో డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధులకు సంబంధించిన అత్యాధునిక చికిత్సలు తమ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆధునిక సాంకేతికతో కూడిన దయాలసిస్ యూనిట్లు, అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దబడిన కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ విభాగం ద్వారా రోగులకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు డాక్టర్ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా.. మహిళా దినోత్సవం, కిడ్నీ డేలను పురస్కరించుకుని పలువురిని హాస్పిటల్ నిర్వాహకులు సత్కరించారు. కిడ్నీ దానమిచ్చిన మహిళలను, దీర్ఘకాలికంగా దయాలసిస్ చేయించుకుంటూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న పేషేంట్లను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ రవిచందర్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

గ్రామ గ్రామాన మహిళా దినోత్సవం

మైలవరం నియోజకవర్గంలో ఉత్సాహంగా పాల్గొన్న స్థానిక మహిళలు

చెవుటూరు, ఇబ్రహీంపట్నం

మైలవరం, ప్రసాద్‌నగర్

విశాలాంధ్ర-మైలవరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని స్థానిక మహిళలు పెద్ద పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో మండల సమాఖ్య పతాకాన్ని సీహెచ్. దుర్గా కోటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో మహిళల స్థితిగతులు ఎలా ఉండేవి ఇప్పుడు ఎలా మారాయి అనే విషయాలను వివరించారు. మహిళలకు వారి వారి హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. రాజ్యాంగ స్ఫూర్తి, కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో హక్కుల కోసం జరిగే ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల మల్లీశ్వరి, గౌడమ్మ, సామ్రాజ్యం, సీహెచ్ వసంత, సీహెచ్ కరుణ, పార్వతి, తిరుపతమ్మ, మునిమ్మ చిన్నమ్మాయి, జైనా తదితరులు నాయకత్వం వహించారు.

జి.కొండూరు మండలంలోని చెవుటూరు గ్రామంలో మహిళా సమైక్య నాయకురాలు దూరు ఆదెమ్మ పతాకాన్ని ఎగురవేయగా యేసుమ్మ, సువార్తమ్మ, జమలమ్మ, షేక్ మాబి, ఎస్‌కే ఫాతిమా, షేక్ మున్నీ, షేక్ బాబీజీ, షేక్ సైదాబీ తదితరులు నాయకత్వం వహించారు.

వెలగలగూడెం గ్రామంలో సగ్గుర్తి అంజమ్మ జెండా ఆవిష్కరించగా సగ్గుర్తి పుష్ప రాజ్యం, ఎస్. మంజు, ఎస్.వరమ్మ, డి.సుశీల, ఎస్. కుమారి, ఎస్. మేరీ, డి. సువార్త తదితరులు నాయకత్వం వహించగా స్థానిక సీపీఐ కార్యదర్శి దర్శినపు బుడ్డాయ్ సహకరించారు.

బూరగూడెం గ్రామంలో మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు జంగం ఇందిరా ప్రియదర్శిని, జమ్మి వెంకట్రతమ్మ, మండ్రు అక్కమ్మ, పిట్ల కళావతి, జమ్మి నాగమణి, పిట్ల జ్యోతి, పిట్ల మరియమ్మ, పిల్లి శాంతమ్మ తదితరులు కార్యక్రమానికి సారధ్యం వహించారు.

ప్రసాద్ నగర్‌లో కవ్వూరి నాగమణి పతాకాన్ని ఆవిష్కరించగా కే. సూరమ్మ, జయమ్మ, సువార్త, యు. జమలమ్మ, మేరిమ్మ, సరోజిని, సుందరమ్మ, సుజాత, జ్యోతి, రజని, మహేశ్వరి, తదితరులు నాయకత్వం వహించారు.

సాయన్నపాలెం గ్రామంలో అడపా వెంకమ్మ జెండాను ఎగురవేయగా కాలంగి సామ్రాజ్యం, కందుల యాలాద్రమ్మ, కె వెంకటరత్నం, పి. కోటేశ్వరమ్మ, ఎ. సీతారావమ్మ, యూ వీరమ్మ, కె లక్ష్మీ, వి.లక్ష్మీ తదితరులు నాయకత్వం వహించారు.

రెడ్డిగూడెం గ్రామంలో నమ్మిక మంగమ్మ, ఆదెమ్మ, నర్సమ్మ,బి వెంకాయమ్మ, దుర్గమ్మ, దారమ్మ,వెంకటేశ్వరమ్మ, వసంత తదితరులు నాయకత్వం వహించారు.

రెడ్డిగూడెం, వెలగలగూడెం

పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

సీపీఐ కృష్ణయ్య డిమాండ్

విశాలాంధ్ర-తిరువూరు: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ బీసీ కాలనీ లో గ్యాస్ బండ ధరలు తగ్గించాలని కోరుతూ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. వచ్చే రాబడికి, అయ్యే ఖర్చులకు పొంతనలేక సగటు మనిషి జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం కేవలం బడా పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనాలు కల్పించడమే తప్ప, పేదల సంక్షేమం పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల్లో ఇచ్చిన ఏడాదికి కోటి ఉద్యోగాలు, విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్ల ధనం వెనక్కి తెచ్చి, ఒక్కక్కరి ఖాతాల్లో రూ 15లక్షలు వేస్తానన్న వాగ్దానాలను తుంగలో తొక్కేరని విమర్శించారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మేకల డేవిడ్, పార్టీ నాయకులు ఎం ఉదయ్, ఎస్ కే సుభాని, బీ అశోక్, పీ మురళీ, బీ వెంకటేశ్వరరావు, గుంజా మారెమ్మ, తిరుపతయ్య, చల్లా రమదేవి, గున్నా సుశీల, గుంజ మణి, కాంతారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు పసుపు, కుంకుమ సమర్పణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ళ మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారికి పుట్టింటి పసుపు కుంకుమ కార్యక్రమం వైభవంగా చేశారు. తిరుపతమ్మ చిన్న తిరుణాళ్ళలో ప్రధాన ఘట్టంగా భావించే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు లక్షలాది భక్తులు తరలివచ్చారు. అమ్మవారి పుట్టింటీ గ్రామమైన అనిగండ్లపాడు నుండి అమ్మవారి వంశీకులు కొల్లా శ్రీనివాసరరావు పసుపు కుంకుమలతో పాటు సారెను విద్యుత్ దీపాలతో అలంకరించిన ఎడ్లబండ్లపై ఉంచి ఊరేగింపుగా సమారు 200 వందల ఎడ్లబండ్లకు పైగా ఊరేగింపుగా తిరుపతమ్మ అమ్మ వారి ఆలయానికి పసుపు కుంకుమలు తీసుకువచ్చారు. ముందుగా అనిగండ్లపాడు గ్రామంలోని గ్రామస్తులు, ఆలయ ఈఓ జీవిడి ఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం కేశవరావు, ఆలయ ప్రధాన అర్చకులు మర్రేబోయిన వెంకటరమణ, ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపు కుంకుమల ఊరేగింపు పెనుగంచిప్రోలు కాజ్ వే మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని కన్నులారా వీక్షించేందుకు అనేక రాజకీయపార్టీల నాయకులు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, రాష్ట్ర వైసీపీ నాయకులు వేల్పుల రవికుమార్, జెడ్పీటీసీ ఊట్ల నాగమణి, మండల వైసీపీ అధ్యక్షులు ఊట్ల నాగేశ్వరరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, అనిగండ్లపాడు సర్పంచ్ బోశెట్టి జ్యోతి బ్రహ్మం, సొసైటీ అధ్యక్షులు పిడికిడి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య, ఆలయ మాజీ చైర్మన్లు నూతలపాటి చెన్నకేశవరావు, కర్ల వెంకటనారాయణ, అత్తులూరి అచ్చుతరావు, లగడపాటి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి. బెనర్జీ, సీపీఐ నాయకులు వల్లంకొండ బ్రహ్మం, పాటిబండ్ల లక్ష్మయ్య, గడ్డం. శ్రీనివాసరరావు, వల్లంకొండ భాస్కరరావు సీపీఎం నాయకులు గురవయ్య, దార నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్లకు నందిగామ ఏసీపీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ నాగమురళి పర్యవేక్షణలో స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

నెమలి బ్రహ్మోత్సవాల్లో నేడు పల్లకి ఉత్సవం

విశాలాంధ్ర-గంపలగూడెం : వేణుగోపాలస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా పల్లకి ఉత్సవం గురువారం చేశారు. వేణు గోపాలస్వామి పల్లకి ఉత్సవంగా బయలుదేరి తిరువీధులు వేం చేశారు. అనంతరం వేణుగోపాల స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి దాసరి. శ్రీరామ వరప్రసాద్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావూరి శశిరేఖ, ధర్మకర్తల మండల సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎడ్ల పందాలు ప్రారంభించిన ఆలయ కమిటీ చైర్మన్ కావూరి. శశిరేఖ. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందాలను కావూరి. శశిరేఖ, వినయ్ కుమార్ దంపతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోటీదారులతోపాటు చూపరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా శాఖ రైతుసంఘం కార్యకర్తల సమావేశంలో 10వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నలోని సీపీఐ కార్యాయలంలో జరుగుతుందని జిల్లా రైతుసంఘం కన్వీనర్ మల్నీడి యల్లమందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్, కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, జిల్లా రైతు సంఘం ఇన్‌చార్జ్ బి.రమేష్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి జిల్లా నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రభుత్వ కక్ష సాధింపులకు నిరసనగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ : ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ సీపీఐ-సీపీఎంల రాష్ట్ర సమితిల పిలుపు మేరకు 10వ తేది శుక్రవారం 11 గంటలకు విజయవాడ నగర సమితి సీపీఐ-సీపీఎంల ఆధ్వర్యంలో అలంకార్ సెంటర్ వద్ద ధర్నా చౌక్‌లో 'ధర్నా' జరుగుతుందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఆటోవర్కర్స్ యూనియన్ ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ : సీఎన్‌జీ, గ్యాస్, పెట్రోల్, డీజీల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో 10వ తేది శుక్రవారం 10.30 గంటలకు లెనిన్‌సెంటర్‌లో 'ధర్నా' నిర్వహించనున్నట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాలుర హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : నందిగామ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గురువారం తహశీల్దార్ నరసింహారావుకు, సంబంధిత అధికారులకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నందిగామ పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గదులలో పై పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని, కొన్ని గదులలో కింద నాపరాల్లు పగిలి విషజంతువులు చేరుతున్నాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు తెలిపారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక వసతులు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలియజేశారని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 70 మందికిపైగా విద్యార్థులు ఉన్నారని ఐదవ తరగతి నుండి ఇంటర్ వరకు విద్యార్థులు ఈ హాస్టల్లో వసతి పొందుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నందిగామ ఆర్డీవో కార్యాలయంలో ఏవో నరసింహారావుకి అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు తక్షణమే నాడు నేడు ద్వారా వసతి గృహంలో సదుపాయాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మన్నే హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మౌలాలి, కమిటీ సభ్యులు వై నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు గ్రామీణ ప్రాంత మహిళలను చైతన్యవంతం చేయాలి : జడ్జి శిరీన్

విశాలాంధ్ర-మైలవరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలమేరకు వారంరోజులు మహిళలను చైతన్యవంతం చేసే విధంగా న్యాయ విజ్ఞాన సదస్సులు జరగాలని పిలుపుమేరకు మైలవరం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మూడవ సచివాలయంలో మహిళా పోలీసులు వలంటీర్లతో గురువారం సాయంత్రం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మైలవరం మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జడ్జి షేక్ షరీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశం ఇస్తూ భారతదేశంలో స్త్రీని పూజించే, గౌరవించే దేశంగా ఉన్న అనునిత్యం మహిళపై పురుషుల ఆదిపత్యం వివక్షత కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మహిళలు నిరక్షరాస్యత బానిసత్వం పురుషాధిక్యత ప్రభావంతో నిత్యం యాసిడ్ దాడులు మహిళలను హత్య చేసి ముక్కలుగా కోసి ఫ్రిజ్లో ఉంచే సంస్కృతి, అత్యాచారాలు, దేశ రాజధాని ఢిల్లీలోని నిర్భయ వంటి అతి దారుణంగా అత్యాచారం చేసి చంపేయటం ,2022 జాతీయ మహిళా కమిషన్ ముందు భారతదేశవ్యాప్తంగా 31 వేల కేసులు మహిళపై దాడులు ఉన్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి మైలవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బుద్ధవరపు వెంకటరావు అధ్యక్షత వహించగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముల్లంగి రవికుమార్ మైలవరం గ్రామ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహునికి విద్యార్థుల నివాళి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట్రామయ్య వర్ధంతిని పురస్కరించుకుని విస్సన్నపేట మండలంలో విద్యార్థులు ఆయనకు నివాళులర్పించారు. మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేయగా, హెచ్ఎం ఇ.జయరామ్ గ్రంథాలయాల ఆవిర్భావానికి అయ్యంకి చేసిన పోరాటాన్ని, కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులచే విద్యాలయంలోని గ్రంథాలయంలో పలు పుస్తకాల పఠనం చేయించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హివాగా స్కిన్ హెయిర్ బ్యూటీ సెలూన్ అండ్ ఈస్తటిక్స్ వ్యాపారవేత్త హరితకు నేషన్ వైడ్ బిజినెస్ మింట్ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): విజయవాడ కరెన్సీ కాలనీలో హివాగా మహిళా సౌందర్య సెలూన్ ఆంధ్ర ప్రదేశ్ బ్రాంచ్ ఆఫీస్ నుంచి విడుదల చేసిన ప్రకటనలో మహిళా దినోత్సవం సందర్భంగా సౌందర్యం వ్యక్తిగత సంరక్షణ పరిశ్రమ హివాగా స్కిన్ హెయిర్ బ్యూటీ సెలూన్ అండ్ ఈస్తటిక్స్ వ్యవస్థాపకురాలు యస్. హరితకు బిజినెస్ మింట అవార్డును అందుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ తెలుగు ప్రాంతం అంతటా సెలూన్, సౌందర్యశాస్త్రంలో వారి హివాగా సంస్థ ను విస్తరించి ప్రజల నుంచి మంచి మనలను పొందింది ఇటీవల నేషనల్-వైడ్ బిజినెస్ మింట్ అవార్డును గెలుచుకుంది. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున ఆమె తన విజయాన్ని, మహిళా సాధికారతపై తన విస్తృత అభిప్రాయాలను వ్యక్తం చేసింది. సమాజంలోని ప్రతి స్త్రీ తమ ఆలోచనల పట్ల అభిరుచి , ఆసక్తితో నిండిన హృదయంతో తాము అనుకున్నది, కలలు కనేది చేయగలదని ఆమె అన్నారు.

కుక్కల దాడిలో యువకునికి గాయాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో వీధికుక్కలు దాడి చేయటంతో ఒక యువకుడు తీవ్రగాయాలపాలయ్యారు. విస్సన్నపేటకు చెందిన పర్వతం శివకుమార్ సైకిల్‌పై నూజివీడు రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటర్‌కు వస్తుండగా ఈ దాడి జరిగింది. కొన్ని శునకాలు పెట్రోలుబంకు సమీపంలో ఒక్కసారిగా యువకునిపై దాడి చేయగా, స్థానికులు వాటిని తరిమికొట్టి, బాధితుడిని కాపాడారు. కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, వైద్యసేవలందిస్తున్నారు.

ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురు వారం రాత్రి యుటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు వివిధ రంగాల్లో చేస్తున్న కృషిని ఉపాధ్యాయసంఘం నేతలు వివరించారు. అనంతరం ఉపాధ్యాయురాలు హసీనా, సీఆర్పీ రత్నకుమారిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కార్యదర్శులు బిసిహెచ్.సూర్యనారాయణ, పి.వీరకోటి, మండల కమిటీ అధ్యక్షురాలు చైతన్య, నాయకులు శోభాలత, కె.రంగా, డి.రాంబాబు, పి.రామకృష్ణ, ఎ.మురళీకృష్ణ, శంకర్రావు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో రెవిన్యూ సిబ్బంది నిరసనలు

విశాలాంధ్ర-వీరులపాడు : ఉద్యోగ సంఘాల పిలుపుమేరకు మండలకేంద్రం వీరులపాడులోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో రెవిన్యూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసనను తెలిపారు. ఉద్యోగస్తుల డిమాండ్లపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉద్యోగ సంఘాల పిలుపుతో ప్రభుత్వ కార్యాలయాల ముందు తమ నిరసనను తెలియజేసినట్లు రెవెన్యూ ఉద్యోగస్తులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఆంజనేయులు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ సింగ్, వీఆర్వోలు రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - విస్సన్నపేట

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.5/2023 తేది : 06-03-2023

ఎన్.టి.ఆర్ జిల్లా, విస్సన్నపేట మండలం, విస్సన్నపేట గ్రామ పంచాయతీనందు **2023-2024** సంవత్సరమునకు అనగా **ది.01.04.2023** నుండి **31.03.2024**వ తేదీ వరకు ఈ దిగువ షెడ్యూలలో చూపిన ప్రకారం కాంట్రాక్టు ఏజన్సీ పద్ధతిపై పనిచేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. **టెండర్లు ది.16.03.2023**వ తేదీ గురువారం **ఉదయం 10.30** గం.ల నుండి **మధ్యాహ్నం 12.00** గం.ల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే సీల్డు టెండర్లు స్వీకరించబడును. **అదేరోజు 12.30 గం.లకు** అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచినవారు నిర్ణయించిన ధరవత్తు చెల్లించి పాల్గొనవచ్చును. ప్రభుత్వం వారి షరతులకు లోబడి టెండర్లు దాఖలా చేయవలెను. టెండరు షెడ్యూల్ మరియు మిగిలిన వివరములు పంచాయతీ కార్యాలయం పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. టెండర్లు రద్దుపరుచుటకు లేదా అనుమతించుటకు పంచాయతీకి అధికారం కలదు.

వ.నెం.	పనిపేరు	కావలసిన సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1.	పారిశుద్ధ్యం పనులు	23	01-04-2023 నుండి 31-03-2024 వరకు (ఒక సంవత్సర కాలము)	రూ.10,000/-
2.	మంచినీటి సరఫరా పనులు	15	-డిటో-	రూ.7,000/-
3.	వీధి దీపముల రిపేర్లు	02	-డిటో-	రూ.3,000/-

కార్యదర్శి వారి నోట్:
1. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించి పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.
2. ఈ గ్రామ పంచాయతీ నగదు నిల్వలను బట్టి పైకము చెల్లించబడును. ఆలస్యమునకు ఎటువంటి ముదరా ఇవ్వబడదు.
3. గతములో ఈ పంచాయతీలో పనిచేసిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడును.
4. టెండరు తిరస్కరించుటకు గాని, ఆమోదించుటకు గాని పంచాయతీకి అధికారము కలదు.
5. సంబంధిత అధికారులు నుండి అనుమతి పొందిన తదుపరి పేమెంట్ చేయబడును.

సం/- **బి.యస్.యస్. శ్రీనివాస్**
పంచాయతీ కార్యదర్శి, విస్సన్నపేట